సాక్షి వనపర్తి

శుక్రవారం ၊ 28 ၊ జూన్ ၊ 2024



విద్యాధికారులేరి!

ఎంఈఓల నియామకాలు చేపట్టకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది.

వివరాలు 8లో ▸



పొల్యూషన్ బోర్డు తనిఖీలు

పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ మండలి తనిఖీలు చేపట్టింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
27.3 /23.2

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్, తెలుగు, జంతుశాస్త్రం, గణితం ఖాళీలున్నాయని.. పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులున్న వారు అర్హులన్నారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి మొదటి, నెట్, స్లెట్ అర్హతలున్న వారికి తదుపరి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నియామకం 2024–25 సంవత్సరానికి మాత్రమే ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు జూలై 2 మధ్యాహ్నం 3.30 వరకు నేరుగా డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 94400 46786 సంప్రదించాలని **సూచించారు.**

పింఛన్ల రద్దుపై అధికారుల విచారణ



పాన్‌గల్: మండల కేంద్రంలో రద్దయిన ఆసరా పింఛన్లపై గురువారం స్థానిక తపాలా కార్యాలయంలో జిల్లా డీఆర్డీఓ అధికారులు విచారణ చేసి పూర్తి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డీపీఎం ప్రభాకర్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఆసరా పింఛన్లు పొందుతున్న వారిలో నలుగురివి రద్దు చేశారని.. కుటుంబ, ఆధార్ వివరాలు సేకరించి జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. అలాగే మండలంలో 46 మంది ఆసరా పింఛన్లు రద్దయినట్లు తెలిపారు. వాటి వివరాలు గ్రామాల వారీగా సేకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ పరశురాం, పోస్టుమెన్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 2 నుంచి ధార్మిక కార్యక్రమాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వచ్చేనెలలో చేపట్టనున్న ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల పోస్టర్లను గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి మాట్లాడుతూ 2వ తేదీ నుంచి 6 వరకు దేవరకద్ర మండలం హజిలాపురంలోని శివాంజనేయస్వామి దేవాలయం, 9 నుంచి 13 వరకు ఉర్కొండ మండలం జకినాలపల్లిలోని శివాంజనేయస్వామిదేవాలయం, 16 నుంచి 20 వరకు భూత్పూర్ మండలం తాటికొండలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయం, 23 నుంచి 27 వరకు కేశంపేటలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయం, 30, 31 తేదీల్లో కల్వకుర్తి మండలం యంగంపల్లిలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయాల్లో ఉపన్యాసం, శ్రీమద్రామాయణం, హనుమాన్‌చాలీసా పారాయణం, శ్రీమద్ మహాభారతం, శ్రీమద్భగవద్గీ భజనలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారని తెలిపారు. శ్రీవారి సేవకులు జి.పాండురంగం, సురేష్‌చందర్‌దూత్,చంద్రకళారెడ్డి, నిర్మలమ్మ, భారతమ్మ, హజిలాపురం భజన మండలి సభ్యులు నారాయణగౌడ్, చంద్రశేఖర్, నర్సింలు, మాతృమండలి సభ్యులు లక్ష్మీ సింధు, సాధన, మంజుల, నారాయణమ్మ, అనిత, ఉమారాణి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలుచేయాలి

గద్వాల అర్బన్: ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి బడ్జెట్లో తగినన్ని నిధులు కేటాయించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని వాల్మీకి భవన్‌లో కొనసాగుతున్న కేవీపీఎస్ సామాజిక శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దళితులు ఎన్నో పోరాటాలతో సాధించుకున్న సాబ్ ప్లాన్ చట్టం నీరుగారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేటీకరణ చేయడంతో సంపద కేంద్రీకరణ పెరిగి అణగారిన కులాలు, జాతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. రానున్న బడ్జెట్‌లో సబ్ ప్లాన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి, దళితుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలన్నారు. జిల్లాలోని హాస్టళ్లలో కేవీపీఎస్ సర్వే చేపట్టిందని, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, మెస్ ఛార్జీలను పెంచాలని, సొంత భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మారెన్న, కార్యదర్శి రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు పరంజ్యోతి, ఆంజనేయులు, విజయ్ కుమార్, కరెప్ప తదితరులు ఉన్నారు.



జనవరి 20 కల్వకుర్తికి చెందిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రమావత్ వశ్య రూ.8 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.

జనవరి 22 జడ్చర్ల ఎక్సైజ్ సీఐ రత్నవత్ బాలోజీ కల్లు గీతకు సంబంధించి లైసెన్స్ ఇచ్చేందుకు ఓ వ్యక్తి నుంచి రూ.65 వేలు తీసుకుంటూ దొరికాడు.

జనవరి 29 అయిజ లైన్‌మేన్ జీవరత్నం రూ.20 వేలు లంచం తీసుకుంటూ చిక్కాడు.

ఫిబ్రవరి 4 మహమ్మదాబాద్ ఎస్‌ఐ దూపల్లి సురేష్, కానిస్టేబుల్ ఇస్మాయిల్, ప్రైవేట్ వ్యక్తి మహ్మద్ మూసాతో కలిసి రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

ఫిబ్రవరి 10 మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజినీర్ పృథ్వీ రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా విద్యుద్దీపాల అలంకరణ, రోడ్ల శుభ్రత బిల్లు మంజూరుకు కాంట్రాక్టర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసి ఏసీబీ వలలో చిక్కాడు.

మార్చి 27 నారాయణపేట జిల్లా గుండుమాల్ తహసీల్దార్ పాండునాయక్, ధరణి ఆపరేటర్ రవీందర్‌రెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ చిన్న మొగులప్ప ముగ్గురు కలిసి వ్యవసాయ భూమిని ఒకరి పేరు నుంచి మరొకరికి బదలాయింపు చేసేందుకు రూ.2 వేల చొప్పున లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

మే 31 వనపర్తి విద్యుత్ శాఖ ఎస్ఈ పి.నాగేంద్రకుమార్, డీఈఎం నరేంద్రకుమార్, ఏఈ భూక్య మధుకర్ రెస్టారెంట్ పక్కన లైన్ పోల్ ఇచ్చేందుకు రూ.19 వేలు లంచం తీసుకుంటూ చిక్కారు.




జూన్ 12 జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి పదో బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్ నర్సింహస్వామి రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఓ కానిస్టేబుల్‌పై శాఖాపరమైన ఎంక్వైరీ జరుగుతుండగా.. ఆయనకు అనుకూలమైన రిపోర్ట్ ఇవ్వడం కోసం లంచం అడిగి ఏసీబీ వలలో చిక్కాడు.

జూన్ 25 తాజాగా జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్న క్రమంలో కేసు నమోదు **చేయకుండా ఉండేందుకు ఒకరి వద్ద వెల్దండ ఎస్సై ఎం.రవి రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.**

ఏసీబీ దూకుడు..

అవినీతిపై ఉక్కుపాదం

- పాలమూరులో ఎక్కడ చూసినా అవే జాడలు..
- ప్రధానంగా పోలీస్ శాఖపైనే మరకలు
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 9 కేసులు నమోదు
- తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి స్థానం..
- రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖలపై పక్కా నిఘా



పాలమూరుపై అవినీతి నిరోధక శాఖ ఫోకస్ పెట్టింది. ప్రధానంగా అవినీతికి కేరాఫ్‌గా నిలిచిన ప్రభుత్వ శాఖలపై దృష్టి సారించి.. ఒక్కొక్కరి భరతం పడుతోంది. కేవలం ఆరు నెలల కాలంలో14 మంది ప్రభుత్వ ఉద్యోగులు వరుసగా ఏసీబీకి చిక్కడం ఆ శాఖ దూకుడును తెలియజేస్తోంది. ఏసీబీ దాడుల్లో నేరాలను అరికట్టి, శాంతి భద్రతల పర్యవేక్షణతో పాటు చట్టం అమలు చేయడంలో కీలకపాత్ర పోషించాల్సిన పోలీస్ శాఖకు చెందిన పలువురు అధికారుల లంచగొండి అవతారం వెలుగులోకి రావడం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది. ఏదిఏమైనా అవినీతి మరకల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది.

\- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

ఈ ఏడాది అవినీతి కేసుల నమోదులో పాలమూరు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. అత్యధికంగా అవినీతి కేసులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నమోదైనట్లు తెలుస్తోంది. 2024 జనవరి నుంచి ఈ నెల 26వ తేదీ వరకు మొత్తం తొమ్మిది కేసులు నమోదైనట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రధానంగా పోలీస్‌శాఖకు సంబంధించి మూడు, రెవెన్యూ, విద్యుత్ శాఖలవి రెండు చొప్పున, ఎక్సైజ్, మున్సిపల్ శాఖలవి ఒకటి చొప్పున కేసులు నమోదు కాగా.. ఆయా శాఖలు అవినీతి కూపంలో కూరుకుపోయినట్లు స్పష్టమవుతోంది.

కాసులు లేనిదే కదలని కాగితం..

ఓ వైపు ప్రభుత్వ శాఖల్లో అవినీతి కంపును వదిలించేందుకు ఏసీబీ ప్రయత్నిస్తున్నా.. పలు విభాగాలకు చెందిన సర్కారు ఉద్యోగుల్లో మార్పు రావడం లేదు. ప్రధానంగా రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖల్లో పలువురు సర్కారు ఉద్యోగులు తమ రూటే సెప'రేట్' అనేలా వ్యవహరిస్తున్నారు. కాసులివ్వనిదే కాగితం కదలని పరిస్థితి నెలకొంది. ఆయా శాఖలకు సంబంధించి అవినీతి పర్వంపై పలువురు ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేసిన సంఘటనలు ఉన్నాయి. పౌర సేవల విషయంలో పనికో రేటు చొప్పున ఫిక్స్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మహబూబ్‌నగర్‌లోనే ఎక్కువ..

ఉమ్మడి జిల్లా ప్రజల్లో చాలా వరకు చైతన్యం వచ్చింది. గతం కంటే ఫిర్యాదులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 9 కేసులు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్‌లోనే ఎక్కువ మంది ఉద్యోగులు పట్టుబడ్డారు. అందిన ఫిర్యాదుల మేరకు దాడులు మరింత ఉధృతం చేస్తాం. ఎక్కడైనా అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటే టోల్ ఫ్రీ నంబర్ **1064** కు ఫిర్యాదు చేయాలి.

\- శ్రీకృష్ణగౌడ్, ఏసీబీ డీఎస్పీ

ఆ శాఖలపై పక్కా నిఘా..

మండలకేంద్రాల్లోని రెవెన్యూ, పోలీస్‌శాఖకు సంబంధించి అక్రమాలపై ఏసీబీకి భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు వీటితో పాటు అవినీతి, అక్రమాలకు నెలవుగా ఉన్న విద్యుత్, మున్సిపాలిటీ, రిజిస్ట్రేషన్, కమర్షియల్ ట్యాక్స్, చెక్‌పోస్టులు, రవాణా, ల్యాండ్ సర్వే శాఖలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మరోవైపు రవాణా, కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు పలువురు నేరుగా లంచాలు తీసుకోకుండా ప్రైవేట్ వ్యక్తులను ఏజెంట్లుగా పెట్టుకుని సాఫీగా పనులు సాగిస్తున్నట్లు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. అయితే రెండేళ్లుగా ఏసీబీ అధికారులు ఈ శాఖల వైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. రెవెన్యూశాఖలో ఆన్‌లైన్‌లో సేవలు అందుతున్నప్పటికీ అవినీతి, అక్రమాలకు అంతే లేకుండాపోయింది. ఇదివరకే అందిన ఫిర్యాదుల ప్రకారం ఆయా శాఖల్లో అవినీతి అధికారులు, సిబ్బందిపై ఏసీబీ అధికారులు పక్కాగా నిఘా పెట్టినట్లు సమాచారం.

అభివృద్ధి పనుల్లో జాప్యమెందుకు?



విద్యాశాఖ, పీఆర్ ఇంజినీర్ల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలోని 329 బడులను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేయగా.. పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఇప్పటి వరకు ఎందుకు పూర్తి కాలేదని, ఎప్పటి వరకు పూర్తి చేస్తారో లిఖితపూర్వకంగా ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనుల పురోగతి, విద్యార్థుల యూనిఫాం పంపిణీపై విద్యాశాఖ, పంచాయతీరాజ్ ఇంజినీర్లు, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే పనులు పూర్తి చేయాలని 25 శాతం నిధులు ముందస్తుగా చెల్లించినా.. పనులు నెమ్మదించడంపై వివరణ ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు పనులు పూర్తయిన పాఠశాలల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని.. మండలానికి మూడు చొప్పున ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. మిగిలిన పనులపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పనులు పూర్తిచేసిన తర్వాత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అభ్యంతరాలు లేవనే ధ్రువపత్రం తీసుకోవాలన్నారు. పనులు పూర్తయిన పాఠశాలల అన్ని ధ్రువపత్రాలతో పాటు ఎంబీలు సమర్పించాలని సూచించారు. పనులు ప్రారంభించక ముందు.. పూర్తయిన తర్వాత ఫొటోలను జతపర్చాలని కోరారు. విద్యార్థులందరికి యూనిఫాంలు సకాలంలో అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్అండ్‌బీ ఈఈ దేశ్యానాయక్, పీఆర్ ఈఈ మల్లయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, విద్యాశాఖ డీఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల కొరత ఉండొద్దు..

జిల్లా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసి ఉంచాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమైందని అన్నిరకాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని, మెట్టపంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లా సాగు విస్తీర్ణం, సాగుచేసిన పంటలు, అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వల వివరాలను డీఏఓ సుధాకర్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఏడీఓలు చంద్రశేఖర్, శివనాగిరెడ్డి, ఏఓలు రవికుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి



శ్రీరంగాపురంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి.. చిత్రంలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీడీఓ రవీందర్

పెబ్బేరు రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గురువారం శ్రీరంగాపురం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పూర్తయిన వాటి వివరాలను ఆయా శాఖల అధికారులు సభలో వివరించారు. నిధుల కేటాయింపు, సమస్యల గురించి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు గ్రామం నుంచి జిల్లాస్థాయి వరకు ఉన్న సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధి సాధించాలన్నారు. ప్రజాప్రతినిధులు చేసే పనులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. అనంతరం జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యుల పదవీకాలం ముగుస్తుండటంతో వారిని చిన్నారెడ్డి, అధికారులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. అలాగే గ్రామంలో మహిళా సమాఖ్య భవనం, కేజీబీవీ ప్రహరీ నిర్మాణాలకు శంకుస్థాపన, కేజీబీవీలో మినీట్యాంకును డా. చిన్నారెడ్డి ప్రారంభించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ మురళిగౌడ్, ఎంపీఓ రాజు, సీనియర్ అసిస్టెంట్ పరమేశ్వర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, పీఆర్ ఏఈ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: రేవల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ.. హరితహారంలో అధికారులు ప్రజలను భాగస్వాములను చేస్తూ విజయవంతం చేయాలని సూచించారు. స్వచ్ఛతను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయించాలన్నారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి భోజన వసతి, ఇతర సౌకర్యాలు, హాస్టల్ భవనం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భీమయ్య, ఎంపీపీ సేనాపతి, సింగిల్‌విండో చైర్మన్ రఘు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాల కట్టడి

- ఎస్పీ రక్షిత కె.మూర్తి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి, డీఎస్పీలు వెంకటేశ్వర్‌రావు, ఎస్‌బీ రత్నం తదితరులు

వనపర్తి: అప్రమత్తతతోనే సైబర్ నేరాలను కట్టడి చేయవచ్చని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్లను సంబంధితశాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లావాదేవీలు ఎక్కువగా చేసే వారు కొత్త వ్యక్తుల మాటలు నమ్మి పాస్‌వర్డులు, వ్యక్తిగత సమాచారం చెప్పవద్దని సూచించారు. సెల్‌ఫోన్లలో తెలియని మెస్సేజ్ లింక్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని ఇతరత్రా ఆశ చూపిస్తారని.. వాటికి లొంగిపోతే బ్యాంకు ఖాతాలోని నగదు అపహరించే ప్రమాదం ఉంటుందని వివరించారు. సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకుంటే తక్షణమే టోల్‌ఫ్రీ నంబర్ 1930 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. డబ్బులు పోయిన 24 గంటల్లోపు పైన తెలిపిన నంబర్లకు ఫిర్యాదు చేస్తే డబ్బులు వెనక్కి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సైబర్ క్రైం డీఎస్పీ ఎస్‌బీ రత్నం, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు

అమరచింత: పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీపీఓ రమణమూర్తి హెచ్చరించారు. గురువారం మండలంలోని సింగంపేట, మస్తీపురం గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉంటాయని, నివారించే పనుల్లో పంచాయతీ కార్యదర్శులు ముందుండాలని కోరారు. మురుగు కాల్వల శుభ్రత రోజు కొనసాగాలని, రహదారుల పక్కన తడి, పొడి చెత్త పారబోయకుండా చెత్త సేకరణకు వచ్చే వాహనాల్లో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సేకరించిన చెత్తను విధిగా డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతుల కోసం మిషన్ భగీరథ అధికారులకు నివేదించాలని కోరారు. దోమలు, ఈగల నివారణకు గ్రామాల్లో ఫాగింగ్, మందుల పిచికారీ చేయాలని, బ్లీచింగ్ పౌడర్‌ను మురుగు కాల్వల వెంట చల్లాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నర్సింహులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



మస్తీపురం పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కల తొలగింపును పరిశీలిస్తున్న డీపీఓ రమణమూర్తి

కేంద్ర విధానాలను ఎండగడతాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్




మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని.. ఈ నెల 28న జిల్లాకేంద్రంలో నిర్వహించే ఆందోళనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళన చేపట్టిన అనంతరం మాట్లాడారు. దేశంలో 500 బొగ్గు గనులుండగా.. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 300 ప్రైవేట్, కార్పొరేషన్ సంస్థలకు కారు చౌకగా కట్టబెట్టారని విమర్శించారు. తాజాగా మళ్లీ అదేతరహాలో 67 గనులను వేలం ద్వారా పెట్టుబడిదారులకు అప్పగించేందుకు సిద్ధమైందన్నారు. రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి గనులశాఖ పదవి చేపట్టగానే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా బొగ్గు గనుల వేలం నిలిపివేసి ప్రభుత్వరంగ సంస్థ సింగరేణికి అప్పగించాలని కోరారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన ఉంటూ పోరాటాలు కొనసాగిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్, మండల నాయకులు భగత్, జంబులయ్య, వెంకటయ్య, నర్సింహ, మన్యం, యాదగిరి, నాగేష్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,477

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 165 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6477, కనిష్టం రూ. 2269, సరాసరి రూ. 5589 ధరలు పలికాయి. 10 క్వింటాళ్ల వరి (సోన) రాగా, గరిష్టం రూ.2438, కనిష్టం రూ.1956, సరాసరి రూ. 1956 ధరలు లభించాయి.





క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఆర్టిజన్ కార్మికుడి మృతి


లక్ష్మన్న (ఫైల్)

గట్టు: విద్యుదాఘాతానికి గురై ఆర్టిజన్ గ్రేడ్‌–2 కార్మికుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఆలూరు సబ్‌స్టేషన్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లేష్ కథనం మేరకు.. గద్వాల పాత హౌసింగ్‌బోర్డుకాలనీకి చెందిన బుల్లెద్దుల లక్ష్మన్న(49) మండలంలోని ఆలూరు సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ గ్రేడ్‌–2 ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించేవాడు. గురువారం విధుల్లో ఉండగా ఏఈ చిన్నయ్య లోడ్ ఎక్కువగా ఉందని.. త్రీఫేస్ నుంచి సింగిల్ ఫేస్‌కు మార్చాల్సిందిగా ఫోన్‌లో ఆదేశించారు. దీంతో సబ్‌స్టేషన్‌లో బ్రేకర్‌ను ట్రిప్పు చేయకుండా పెంచికలపాడు ఏబీ స్విచ్‌ను ఆపరేట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి గద్వాల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: మండలంలోని బూరెడ్డిపల్లి క్రాస్ రోడ్ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి జరిగిన చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. స్థానిక పాతబజార్‌కు చెందిన కొర్వల్లి ఆంజనేయులు(50) మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో జాతీయ రహదారిపై ఉన్న దాబాలో భోజనం చేసి వస్తానంటూ ఇంట్లో చెప్పి తన మోపెడ్‌పై వెళ్లాడు. బూరెడ్డిపల్లి వద్ద రోడ్ క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య అరుణమ్మ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ దశరథ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్యాంకర్, ద్విచక్ర వాహనం ఢీ : వ్యక్తి మృతి

రాజాపూర్: ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి ట్యాంకర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం రంగారెడ్డిగూడ దగ్గర జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజాపూర్ మండలంలోని కుచ్చర్‌కల్ గ్రామానికి చెందిన యాదయ్య(42) షాద్‌నగర్‌లోని కూరగాయల మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. బుధవారం హమాలీ పనికి వెళ్లి గురువారం ఉదయం తన ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రంగారెడ్డిగూడ వద్ద జాతీయ రహదారిపై వెనక నుంచి ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య మాలతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


ఈశ్వరయ్య (ఫైల్)

కొల్లాపూర్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కొల్లాపూర్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. కొల్లాపూర్ పట్టణంలోని జమ్మాన్‌గడ్డకు చెందిన పుట్టపాగ ఈశ్వరయ్య(45) సోమశిలకు వెళ్లే దారిలో గల తమ వ్యవసాయ పొలానికి వెళ్తుండగా.. మోటార్‌సైకిల్ పై నుంచి కిందపడి మూడు రోజుల క్రితం గాయపడ్డాడు. కాగా అతడిని కొల్లాపూర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం ఉదయం మృతిచెందారు.

యువకుడి బలవన్మరణం


కిట్టు (ఫైల్)

బల్మూర్: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలపరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బాణాలకి చెందిన నాగటి కిట్టు (22) తల్లిదండ్రులు ఇరవై ఏళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందారు. కాగా తన తాత నాగటి సత్యయ్య అతడిని పెంచారు. కాగా కిట్టు తల్లిదండ్రులు లేరని మనస్తాపానికి గురయ్యేవాడు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో కిటికీ ఊచలకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు గమనించారు. అతడి తాత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇందిర తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

మిడ్జిల్: మండలంలోని బోయినిపల్లి గ్రామంలో రెండు వారాల క్రితం హనుమాన్ దేవాలయంలో చోరీ చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జైప్రసాద్ తెలిపారు. బోయినిపల్లికి చెందిన ఎర్కలి ఆంజనేయులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మండల విద్యాధికారులేరి!


అడ్డాకుల మండలం పొన్నకల్ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మండల విద్యాధికారి బాలకిషన్ (ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో 9 మందే రెగ్యులర్ ఎంఈఓలు
- సీనియర్ హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలు
- ఒకరికి రెండు నుంచి ఐదు మండలాలు కేటాయింపు
- పాఠశాలలపై కొరవబడిన పర్యవేక్షణ

అచ్చంపేట: విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయి చర్యలకు పొంతన లేకుండా పోతోంది. గత ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' పేరిట, ప్రస్తుతం 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పేరుతో బడుల్లో అభివృద్ధి పనులు చేపడుతోంది. మరోవైపు బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమం నిర్వహించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. పాఠశాలలను పర్యవేక్షణ చేసే అధికారులు లేకపోవడంతో నిర్వహణ గాడి తప్పుతోంది. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్యావ్యవస్థను తీర్చిదిద్దుతామని చెబుతున్నా.. కనీసం మండల విద్యాశాఖ అధికారులను నియమించలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలో 612 మండలాలు ఉండగా.. కేలం 16 మంది రెగ్యులర్ ఎంఈఓలు మాత్రమే ఉన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా విషయానికొస్తే 8 మంది ఉండగా ఈ నెలలో నారాయణపేట జిల్లా ఊట్కూర్ ఎంఈఓ వెంకటయ్య ఉద్యోగ విరమణ పొందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వందకుపైగా ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జ్ ఎంఈలుగా కొనసాగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 600 ఎంఈఓల పోస్టులు భర్తీచేస్తే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. 2015లో ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా తీసుకున్న ప్రభుత్వం ఆ తర్వాత అదనపు బాధ్యతలు కూడా ఇవ్వలేదు.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..

మహబూబ్‌నగర్ జిల్లాలోని చిన్నచింతకుంట, గండీడ్, నారాయణపేట జిల్లాలోని ఊట్కూరు, నాగర్‌కర్నూలు జిల్లాలోని బల్మూర్, కల్వకుర్తి, వంగూరు, తిమ్మాజీపేట, వనపర్తి జిల్లాలోని పానగల్లు మండలాలకు మాత్రమే రెగ్యులర్ ఎంఈఓలు ఉన్నారు. వీరు కూడా రెండు నుంచి ఐదు మండలాలకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని మండలాల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులు పాఠశాల విధులతో పాటు అదనంగా రెండు, మూడు మండలాల ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా కొనసాగుతుండటంతో ఎటూ న్యాయం చేయలేకపోతున్నారు. అదేవిధంగా జిల్లా ఉపవిద్యాధికారి పోస్టు లు, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారుల ఖాళీలున్నాయి. సీనియర్ ప్రధానోపాధ్యాయులను రెండేళ్ల కాలపరిమితిగాను సెక్టోరియల్ అధికారులుగా నియమించారు. వారి కాలపరిమితి కూడా పూర్తయింది. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఇతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తేనే పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

మండల విద్యాధికారుల నియామక విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత ఏర్పడిన కొత్త మండలాలకు ఎంఈఓలను నియమించలేదు. మరోవైపు పాత మండలాల ఇన్‌చార్జ్ ఎంఈఓలు ఇటీవల జరిగిన హెచ్‌ఎంల బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. ఓ వైపు కొత్త మండలాలకు ఎంఈఓలు లేకపోగా.. ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జ్ ఎంఈఓలు బదిలీకావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణ తలకు మించిన భారంగా మారుతోంది.

20 ఏళ్లుగా బదిలీలు లేవు..



20 ఏళ్లుగా ఎంఈఓలకు బదిలీలు లేవు. నిబంధనల ప్రకారం ఐదేళ్లకోసారి బదిలీ జరగాలి. ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు, రెగ్యులర్ ఎంఈఓల బదిలీలకు సంబంధం లేకపోయినా.. నిలిపివేయడం న్యాయం కాదు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల మాదిరిగా రెగ్యులర్ ఎంఈఓలను బదిలీలు చేస్తూ ఖాళీలను కూడా భర్తీ చేయాలి. అదనపు బాధ్యతలతో అన్ని మండలాలకు సరైన న్యాయం చేయలేకపోతున్నాం.

–రామారావు, ఎంఈఓ, బల్మూర్

ఏకీకృత సర్వీస్‌రూల్స్‌తోనే..

రాష్ట్రంలో ఏకీకృత సర్వీస్‌రూల్స్ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉండటంతో ఎంఈఓల నియామకాలు నిలిచిపోయాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలు కలిపి 2000 సంవత్సరంలో జీహెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు ఎంఈఓలుగా పదోన్నతులిస్తూ బదిలీలు చేశారు. దీనిపై ప్రభుత్వ పాఠశాల వారు కోర్టును ఆశ్రయించారు. ఇద్దరిని కలపాద్దని, వారు ఒప్పుకుంటేనే ప్రమోషన్లు ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చింది. అప్పటి నుంచి ఎంఈఓల నియామకం పెండింగ్‌లో ఉంది. అలాగే 2005 నుంచి రెగ్యులర్ ఎంఈఓలకు బదిలీలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదోన్నతులు, బదిలీలకు ఎలాంటి సంబంధం లేకపోయినా.. ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అడ్డుపెట్టి బదిలీలు నిలిపివేస్తున్నారని ఎంఈఓలు వాపోతున్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ పరిష్కారమైతేనే ఎంఈఓలను నియమించే అవకాశం ఉంటుంది. దీంతో సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జ్ మండల విద్యాధికారులుగా ప్రభుత్వం నియమించింది. కేసు పరిష్కారం దిశగా ప్రభుత్వం, ఉపాధ్యాయ సంఘాలు అడుగు వేయాల్సిన అవసరం ఉంది.

ఎవరి కోసం ఈ నిధులు?


జిల్లా మహా సమాఖ్య భవనం

- రూ.60 లక్షల బడ్జెట్ కాగా రూ.9.85లక్షలు అదనంగా విడుదల
- 4ఏళ్లయినా పూర్తికాని మహా సమాఖ్య భవనం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని మహా సమాఖ్య భవనం నిర్మాణంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా రూ.60 లక్షల బడ్జెట్‌లో భవన నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా, మరో రూ.9.85 లక్షలు ఎవరి కోసం విడుదల చేశారో తెలియాల్సి ఉంది. మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు, సంఘాలను బలోపేతం చేయడం, వారికి శిక్షణ ఇచ్చేందుకు ఓ భవనం ఉండాలని ప్రభుత్వం నిర్మించతలపెట్టిన మహా సమాఖ్య భవనం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. బండమీదిపల్లిలోని టీటీడీసీ ఆవరణలో నిర్మించిన ఈ భవనాన్ని 2016 ఫిబ్రవరిలో పనులను ప్రారంభించి, 2019 వరకు పూర్తి చేయాలని అప్పటి అధికారులు నిర్ణయించారు.

రూ.60 లక్షలతో నిర్మాణం

పాలమూర్ మహా సమాఖ్య భవనం నిర్మాణం కోసం రూ.60 లక్షల బడ్జెట్ నిర్ణయించారు. 2019 మే నాటికి భవనాన్ని పూర్తి చేసి అధికారులకు అప్పగించాల్సి ఉంది. ఈ భవనాన్ని అప్పటికే సిద్ధంగా ఉన్న జిల్లా మహిళా సమాఖ్య భవనంపై నిర్మించారు. దీంతో ఆ భవన నిర్మాణ కాంట్రాక్టర్‌కు బేస్‌మెంట్‌తో పాటు భూమిలోకి పిల్లర్లు వేసే పని లేకుండా పోయింది. దీంతో కొంత ఖర్చు కూడా


అసంపూర్తిగా ఉన్న మూత్ర శాలలు

మిగిలిందని చెప్పాలి. ఈ ఖర్చులోనే 2019లోనే నిర్మాణం పూర్తి చేసి అధికారులకు భవనాన్ని అప్పజెప్పాల్సి ఉంది. అయినా ఇప్పటి దాక భవనాన్ని అప్పగించడం లేదు.

అదనపు నిధులు విడుదల

కాగా ఇచ్చిన బడ్జెట్‌లో భవనాన్ని పూర్తి చేయకపోక మరో రూ.9.85 లక్షలు కావాలని కాంట్రాక్టర్ అడగడం వెంటనే ప్రతిపాదనలు పెట్టారు. పాలమూర్ మహా సమాఖ్య కార్పస్ నుంచి ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు విడుదల చేసి రెండేళ్లు అవుతున్నా ఇప్పటిదాక భవనాన్ని పూర్తి చేసి అధికారులకు అప్పజెప్పలేదు. దీంతోనే పలువురికి అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన బడ్జెట్‌లో పూర్తికావాల్సిన భవనం అది కాక అదనంగా డబ్బులు ఇచ్చినా ఎందుకు భవనం పూర్తి కావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులకు అడిగితే పొంతన లేని సమాధానాలు చెప్పడం కొసమెరుపు. త్వరగా భవన నిర్మాణం పూర్తి చేసి డీఆర్‌డీఓ అధికారులకు అప్పగించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

హెచ్‌సీయూ వీసీని సస్పెండ్ చేయాలి


నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో వీసీ విద్యార్థులను సస్పెండ్ చేయడాన్ని నిరసనగా గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో వీసీ దిష్టబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరసన తెలిపితే వీసీ సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులపై సస్పెండ్‌ను వెంటనే ఎత్తివేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కొన్ని సంవత్సరాల కిందట రోహిత్ వేములను సస్పెండ్ చేస్తే ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్, నందు, సాయి, మణికంఠ, దస్తప్ప పాల్గొన్నారు.

కిరాణ షాపుల్లో తనిఖీ

రాజాపూర్: మండల కేంద్రంలోని పలు కిరాణషాపుల్లో గురువారం లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో లక్ష్మి కిరాణం జనరల్‌స్టోర్, హెచ్‌మార్ట్, ఎస్‌ఆర్‌కే మార్ట్‌లలో ప్యాకేజీలపై, మ్యానిఫ్యాక్చరింగ్ అడ్రస్, ఎమ్మార్పీ, డేట్‌ఆఫ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్, కస్టమర్‌కేర్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ వంటి వివరాలు ముద్రించకపోవడంతో కేసు నమోదు చేసి రూ.40వేలు జరిమానా విధించినట్లు అధికారి రామకృష్ణ తెలిపారు. వ్యాపారస్తులు తమ దుకాణాల్లో డిక్లరేషన్‌లేని ప్యాకేజీలు విక్రయించరాదని, అటువంటివి దొరికినట్లయితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్యాకింగ్ చేసేవారు విధిగా ప్యాకింగ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుందని, తూకాల్లో కూడా తేడా లేకుండా చూసుకోవాలన్నారు. వినియోగదారులు ఎటువంటి కాంప్లైంట్ చేయాలనుకున్న లీగల్ మెట్రాలజీ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని లేదా వాట్సప్‌ద్వారా నెంబర్9010651783 కి కాంప్లైంట్ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.


బాలానగర్‌లో కిరాణ షాపులో తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ

పాముకాటుకు గురైన మహిళ

జడ్చర్ల టౌన్: ఓ మహిళ పాముకాటుకు గురైన ఘటన నియోజకవర్గ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మిడ్జిల్ మండలం వల్లభ్‌రావుపల్లి గ్రామానికి చెందిన శివలీల తన ఇంట్లో నిద్రిస్తుండగా గురువారం తెల్లవారుజామున 4గంటలకు పాముకాటుకు గురయ్యారు. తన కుడి భుజం కింద ఏదో కరిచినట్లు అనిపించగా లేచిచూసిన ఆమె రక్త పింజర కాటు వేసినట్లు గుర్తించారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయటంతో వారు పామును చంపివేశారు. మహిళను చికిత్స నిమిత్తం జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్సం పొందుతున్నారు. కాగా ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలియజేశారు.

రైతు ఐడియా అదుర్స్..



వానాకాలం సీజన్ వచ్చిందంటే చాలు రైతులను అధికంగా వేధించే సమస్య కూలీల కొరత. అయితే, కొందరు రైతులు ఓ ఐడియాతో ఈ సమస్యకు పరిష్కారం చూపారు. ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన రైతులు శేషయ్య, భాస్కర్, తిరుపతయ్య ముందుగా కలుపు తీసేందుకు సాళ్ల వెంట తోలే దంతె తెచ్చారు. దంతెకు ప్రత్యేకంగా 20 లీటర్ల ప్లాస్టిక్ నీటి డబ్బాను అమర్చారు. పైబాగాన కట్ చేసి కింది బాగాన వాటర్ డబ్బాకు రెండు పైపులు ఏర్పాటు చేసి గేట్ వాల్ అమర్చారు. రెండు పైపులను కింది బాగాన ఉండే కొయ్యలకు వెనకబాగాన బిగించారు. నీటి డబ్బాలో ఎరువు కలిపి ఉంచితే దంతె వెళ్తున్న సమయంలో వెనక వైపున ధారలా పడుతుంది. వెంటనే మట్టి కూడా ఎరువుపై పడుతుంది. దీంతో కూలీలతో అవసరం లేకుండానే పత్తి పంటకు ఎరువులు వేయవచ్చు. ఎరువు వేయొద్దు అనుకున్నప్పుడు గేట్‌వాల్‌ను ఆఫ్ చేస్తే సరిపోతుంది. చుట్టుపక్కల రైతులంతా చూసి ఇదే పద్ధతిని పాటిస్తున్నారు.

– ఖిల్లాఘనపురం

వైభవంగా వారోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: అన్నమయ్యవాణి లలితా సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు గద్వాల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవనమాలి పాదపద కవితా తాతసంకీర్తనా చతుర్ద వారోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం మూడో రోజు సంకీర్తనా వారోత్సవాల జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో భువనేశ్వర్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గీత రచయిత సామవేదం వెంకట మురళీకృష్ణ, మద్ది యాదిరెడ్డి, మల్లారెడ్డి, తిరుమలనాథచార్యులు, జానకిరాములు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్వాల చంద్రశేఖరరావు నిర్వహించిన సంకీర్తనా కచేరీ అలరించింది. పలు అన్నమయ్య భక్తి గీతాలను ఆలపించారు. స్థానిక వీరన్నపేటలోని శ్రీసరస్వతి శిశుమందిరం విద్యార్థులతో కలిసి చంద్రశేఖరరావు పలు సంకీర్తనాలు ఆలపించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వచ్చేనెల 1వ తేదీ వరకు సంకీర్తనా చతుర్ధ వారోత్సవాలు కొనసాగనున్నాయి.

బావి తవ్వుతుండగా మట్టిదిబ్బలు పడి వ్యక్తి మృతి

- ఇర్కిచేడు గ్రామంలో విషాధఛాయలు


మృతదేహాన్ని బయటకు తీస్తున్న హిటాచీ


మట్టిలో కూరుకుపోయి మృతి చెందిన జయరాములు

కేటీదొడ్డి: ఓ రైతు పొలంలో వ్యవసాయ బావి తవ్వుతండగా వ్యక్తి ప్రమాదవశాత్తు మట్టిలో చిక్కుకుని మృతి చెందిన ఘటన గురువారం ఇర్కిచేడులో చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. కేటీదొడ్డి మండలంలోని ఇర్కిచేడు గ్రామానికి చెందిన జనార్దన్ అనే రైతు పొలంలో గురువారం వ్యవసాయ బావి తవ్వకం పనులు చేపట్టారు. బావిని తవ్వుతుండగా అడుగున ఇసుక తేలడంతో దానిని పరిశీలించేందుకు జయరాములను సహాయం కోరగా బావిలోకి దిగాడు. అయితే ప్రమాదవశాత్తు బావిలో మట్టి దిబ్బలు ఒక్కసారి కూలడంతో పీకల్లోతు వరకు మట్టిలో చిక్కుకుపోయిన జయరాములు (40) అక్కడిఅక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం హిటాచీ సహయంతో సుమారు 2 గంటల నుంచి శ్రమించి మట్టిని తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహానికి పంచానామా చేసి కుటుంబ సభ్యులకు అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- ఒకేరోజు 15 మందిని గాయపర్చిన వైనం

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బుధవారం 15 మందిని గాయపరిచిందన్నారు. అదేవిధంగా గురువారం సైతం మరో ముగ్గురిని గాయపర్చిందని వాపోయారు. కుక్కను పట్టుకునేందుకు ప్రయత్నించినా తప్పించుకుపోయిందన్నారు. కాగా పంచాయతీ అధికారులు గ్రామంలో కుక్కల సంఖ్యను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ గండి బాల్‌రాజు కోరారు.

రక్త స్రావంతో తల్లి.. రక్తహీనతతో బిడ్డ..

- 20 రోజుల వ్యవధిలో తల్లీ కూతురు మృతి
- నల్లమల లోతట్టు అటవీ ప్రాంతం ఈర్లపెంటలో విషాదం

మన్ననూర్: నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని ఈర్లపెంటలో తీవ్ర విషాదం అలుముకుంది. చెంచుపెంటకు చెందిన ఓ బాలింత 20 రోజుల క్రితం తీవ్ర రక్తస్రావంతో మరణించగా.. ఆమె చిన్నారి కూతురు రక్తహీనతతో మృతిచెందింది. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. లింగాల మండలం ఈర్లపెంటకు చెందిన నిమ్మల గురువమ్మ (35) మూడు నెలల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కాన్పు సమయంలో ఆమెకు తీవ్ర రక్త స్రావమై, అలాగే కొనసాగుతూ వచ్చింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం ఈనెల 9వ తేదీన మన్ననూర్ ఆర్టీటీ ఆస్పత్రికి తరలించారు. బాలింతను పరీక్షించిన స్థానిక వైద్యులు.. జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే తాము అక్కడికి వెళ్లలేమని.. ఇక్కడే చికిత్స అందించాలని బాధిత కుటుంబ సభ్యుల విన్నపం మేరకు ఆస్పత్రి వైద్యులు ఆమెకు ప్రథమ చికిత్స అందిస్తుండగానే మృతిచెందింది. బాలింత గురువమ్మ చనిపోయిన నాటికి 28 రోజుల వయసు కలిగిన శిశువును పరీక్షించిన వైద్యులు.. తీవ్రమైన రక్తహీనతతో ఉందని, మెరుగైన చికిత్స అవసరమని కుటుంబ సభ్యులకు సూచించారు. అయితే చిన్నారికి ఎలాంటి చికిత్స లేకుండానే కుటుంబ సభ్యులు ఈర్లపెంటకు తీసుకువెళ్లారు. రక్తహీనతతో ఉన్న చిన్నారి బాలికకు అప్పాపూర్ మాజీ సర్పంచ్ బాలగురువయ్య, ఐటీడీఏ కార్యాలయం తరఫున పోషకాలు కలిగిన పాల డబ్బాలు, న్యూట్రిషన్‌కు సంబంధించిన చుక్కల మందులు అందజేశారు. కుటుంబ సభ్యులు చిన్నారిని ఎంత బాగా చూసుకున్నప్పటికీ.. తల్లి ప్రేమతో సమానం కాకపోవడంతో పాటు ఎలాంటి వైద్య పరీక్షలు చేయించకపోవడంతో ఆరోగ్య పరిస్థితి క్షీణించి, మంగళవారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. వరుస ఘటనలను దృష్టిలో ఉంచుకొని పాలకులు ఇప్పటికైనా చెంచులకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

Walk In Interview
We required qualified & Experienced Staff to teach below subjects.
Primary : Maths-1, Social-1, English-1 Higher : Hindi-1
To attend the demo on Date: 28-06-2024, 29-06-2024, 01-07-2024 (9.00 am to 5.00 pm) at School Premises.
AKSHARA High School E/M
Kuruhini Shetty Colony, Mahabubnagar.
Ph: 9866759107, 9985630460

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
Plot for Sale 200yds at Padmavathi Colony, Mahabub nagar M : 9886154400

SERVICES

BUSINESS OFFER
లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179

CHANGE OF NAME
I, MUJAHED MOHAMMED ABDUL S/o WAHED ABDUL MOHAMMED, R/o H.No: 1-10-23-3/b/1/1, Shashab Gutta Mahabubnagar Town and Dist.T.G., my son's name recorded in his passport bearing No U7570146 as MOHAMMED ABDUL MUQEET. My son name changed from MOHAMMED ABDUL MUQEET (old name) to MUHAMMAD ABDUL MUNTAHA S/o MUJAHED MOHAMMED ABDUL (new name)

WANTED
నర్మద హోండా షోరూం మహబూబ్‌నగర్, వనపర్తిలో పని చేయుటకు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, ఫ్లోర్ సూపర్ వైజర్, స్పేర్ పార్ట్స్ ఇంచార్జ్, మెకానిక్‌లు కావలెను. సంప్రదించండి: మహబూబ్‌నగర్: 9493159185 వనపర్తి: 9440435060.

కొత్తగా ప్రారంభించిన మా కంపెనీలో జాబ్ చేయుటకు 49 స్త్రీ/పురు కావలెను. జీతం: 14వేలు+DA 6వేలు+ఫ్రీ రూం, భోజనం. Q: 10th-డిగ్రీ, ITI, డిప్లొమా(P/F), మహబూబ్‌నగర్. సెల్: 86880 65411.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి/భోజనం జీతం : 18K ఫోన్: 9180900024 / 9840400073

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రేటు క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - సాక్షి మేనేజర్

బీఆర్ఎస్ కార్యకర్తలు బుల్లెట్లు

కొందరు నేతలు పోయినంత మాత్రాన నష్టమేమీ లేదు

- ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నాయకులతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్య
- కార్యకర్తలనే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం
- కాంగ్రెస్ మోసాలను ప్రజలంతా గమనిస్తున్నారు
- తిరిగి ఆదరించి, రెట్టింపు మద్దతుతో గద్దెపై కూర్చోబెడతారు
- పార్టీ ప్రస్థానం కొనసాగుతుంది.. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని ధీమా



గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్. చిత్రంలో కౌశిక్‌రెడ్డి తదితరులు

మర్కూక్ (గజ్వేల్)/ సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు బుల్లెట్ల వంటి కార్యకర్తలు ఉన్నారని, వారే రేపటి నాయకులని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. కొంతమంది స్వార్థపరులు పోయినంత మాత్రాన బీఆర్ఎస్‌కు నష్టమేమీ లేదన్నారు. పార్టీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానం కొనసాగుతుందని, భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో హుజూరాబాద్, ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''ఆరు దశాబ్దాలపాటు దిక్కూమొక్కూ లేక కొట్టుమిట్టాడిన తెలంగాణను ఓ దరికి చేర్చేందుకు గులాబీ జెండా ఉద్యమ కేతనమై ఎగిరింది. తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి పెద్ద విషయం కాదు.

ప్రజలు మోసపోయారు

ప్రత్యేక రాష్ట్రం సాధించే నాటికి సమైక్య పాలనలో తెలంగాణది దిక్కూమొక్కూ లేని పరిస్థితి. రాష్ట్ర పాలన పగ్గాలు చేపట్టి సాగునీరు, తాగునీరు, కరెంటు వంటి అనేక కీలక వసతులు కల్పించుకున్నాం. అన్ని రంగాల్లో తెలంగాణను తీర్చిదిద్దుకున్నాం. పదేళ్ల స్వల్పకాలంలోనే అద్భుత ప్రగతి సాధించుకున్నాం. ఇటువంటి సమయంలో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్ని కొన్ని సార్లు ఇలాంటి తమాషాలు జరుగుతుంటాయని చరిత్రలోకి వెళితే అర్థమవుతుంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు. పాలిచ్చే బర్రెను వదిలి దున్నపోతును తెచ్చుకున్నట్లు అయిందంటూ ఇప్పుడు బాధపడుతున్నారు. బీఆర్ఎస్ సర్కారులో అందిన లబ్ధి ఇప్పుడు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ కాంగ్రెస్ పాలనలో దారి తప్పింది.

పార్టీయే నాయకులను సృష్టిస్తుంది

ఎప్పుడూ పార్టీ నాయకులను సృష్టిస్తుంది. నాయకులు పార్టీలోకి వచ్చిపోతుంటారు. కొందరు నాయకులు వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి నష్టం రాదు. బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలున్నారు. వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం. పార్టీ బీఫారం ఇచ్చి అవకాశమిస్తే.. ఎవరైనా సిపాయిలుగా తయారవుతారు. ప్రజల్లో చైతన్యం వచ్చి కాంగ్రెస్ చేసిన మోసాన్ని గుర్తిస్తారు. తిరిగి బీఆర్ఎస్‌ను ఆదరిస్తారు. అప్పటిదాకా ఓపికతో ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి..''అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కందాల ఉపేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జహంగీర్, దుండిగల రాజేందర్, చైర్మన్లు, సర్పంచులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌ను మించి ప్రజలు మనకు మద్దతిస్తారు

తెలంగాణ కోసం సాగిన మన 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదు, అయిపోలేదు. ఒకసారి ఓడగొట్టిన ఎన్టీఆర్‌ను తిరిగి ఎలాగైతే ప్రజలు గద్దె మీద కూర్చోబెట్టారో అంతకన్నా గొప్పగా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరిగి ఆదరిస్తారు. అంతకంటే రెట్టింపు మద్దతుతో మనను గద్దె మీద కూర్చుండబెట్టే రోజు త్వరలోనే వస్తుంది. కాంగ్రెస్ పాలన రోజురోజుకూ దిగజారుతోంది.

స్టీరింగ్ పట్టిన కేసీఆర్

ఫామ్‌హౌజ్‌లో మినీ వ్యాన్ నడిపిన బీఆర్ఎస్ అధినేత

మర్కూక్ (గజ్వేల్): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్టీరింగ్ పట్టారు. గురువారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో కాసేపు మినీ వ్యాన్ నడిపారు. అందులో ఎమ్మెల్యేలు, నేతలను కూర్చోబెట్టుకుని ఫామ్‌హౌజ్‌లో కలియదిరిగారు. కొన్నినెలల క్రితం కేసీఆర్‌కు తుంటి ఎముక విరగడంతో, శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. తర్వాత చాలా రోజులు చేతికర్ర సాయంతో నడిచిన ఆయన.. ఇటీవలే వైద్యుల సూచన మేరకు చేతికర్ర వదిలేసి నడవడం మొదలుపెట్టారు. తాజాగా తన ఫామ్‌హౌజ్‌లో ఓమ్నీ వ్యాన్ నడుపుతూ కనిపించారు. వ్యాన్‌లో కేసీఆర్‌తోపాటు ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

కవితా సంకలనాన్ని అందజేసిన కవయిత్రి మహెజబీన్ బేగ్

ప్రముఖ స్త్రీవాద కవయిత్రి మహెజబీన్ బేగ్ గురువారం ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తన కవితా సంకలనం ం 'ఆకులురాలు కాలం'ంపుస్తకాన్ని కేసీఆర్‌కు అందజేశారు.

ఎమ్మెల్యేల పార్టీ మార్పు పిటిషన్..
3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలి

ఇప్పటివరకు స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

- ఈ మేరకు గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది
- వెంటనే నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలి
- పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం ఎమ్మెల్యే పార్టీ మార్పు అంశంపై స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని.. ఆ గడువు దాటి వారమైనా ఇంకా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషనర్ల (బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్) తరఫున సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేకు కనీసం ఇప్పటివరకు నోటీసులు కూడా జారీ చేయలేదన్నారు. వెంటనే నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'వీరు 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున విజయం సాధించి, తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఒక పార్టీ అభ్యర్థిత్వంపై గెలిచి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరిన వీరిని అనర్హులుగా ప్రకటించాలి. స్పీకర్‌ను కలవాలని ప్రయత్నించినా సమయం ఇవ్వడం లేదు. ఈ మెయిల్ ద్వారా పంపిన పిటిషన్‌పై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకునేలా స్పీకర్ ఆదేశించాలి'అని కోరారు. ఇదే విధంగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్.. ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లో చేరారని, ఆయనను కూడా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ చేపట్టారు.

రెండు తీర్పులను పరిశీలిస్తే..

సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపిస్తూ.. 'ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి పార్టీ మారడమే కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేశారు. ఆయనను ప్రజలు ఓడించారు. మార్చి 18న పిటిషన్ ఇచ్చినా స్పీకర్ కార్యాలయం ఇంత వరకు ఏం చర్యలు చేపట్టిందో కూడా చెప్పలేదు. ఈ రోజు విచారణ ఉండగా, ఒక రోజు ముందు కౌంటర్ దాఖలు చేశారు. మహారాష్ట్ర, మణిపూర్ కేసులలో సుప్రీంకోర్టు వెలువరించిన రెండు తీర్పులను పరిశీలిస్తే.. తమ ముందు పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రూల్ 6, 7 ప్రకారం స్పీకర్ నడుచుకోవడం లేదు. వెంటనే నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలి'అని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదుల వాదన కోసం తదుపరి విచారణను జూలై 3కు వాయిదా వేసింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి, అనధికారిక ప్రతివాది తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి హాజరయ్యారు.

సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్ సక్సెస్



భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న గోదావరి నీరు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు గ్రామంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ ఫేస్–1 పంప్‌హౌస్ ట్రయల్‌రన్ గురువారం విజయవంతమైంది. పంప్‌హౌస్‌లోని ఒక మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోయగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ పంప్‌హౌస్‌లో ఒక్కొక్కటి 25 మెగావాట్ల సామర్థ్యం గల ఆరు మోటార్లు ఏర్పాటు చేశారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి ఒక్కో మోటారు 1,500 క్యూసెక్కుల చొప్పున 9,000 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయనున్నాయి. పంప్‌హౌస్ నిర్మాణం మూడేళ్ల క్రితమే పూర్తయినా.. విద్యుత్ బిల్లులు భారమవుతాయనే ఉద్దేశంతో ఇంతవరకు ట్రయల్ రన్ చేపట్టలేదు. విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేదు. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పంప్‌హౌస్‌ను సందర్శించి విద్యుత్ కనెక్షన్ ప్రారంభించారు. దీంతో పది రోజులుగా ట్రయల్ రన్ పనులు చేపట్టిన అధికారులు.. గురువారం ఆ ప్రక్రియను పూర్తి చేశారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ సలహాదారు పెంటారెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల కొనుగోళ్లను నిలిపివేయాలి

- రాష్ట్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో బీజేపీ కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయి
- బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, పార్థసారథి విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర. చిత్రంలో పార్థసారథి, సురేశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, మహారాష్ట్రలో బీజేపీ ఎమ్మెల్యేల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయని బీఆర్ఎస్ ఎంపీలు ఆరోపించారు. ఇదేనా ప్రజాస్వామ్యం అంటూ ఆ రెండు పార్టీలను నిలదీశారు. రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల కొనుగోళ్లను కాంగ్రెస్ నిలిపివేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఎంపీలు కె.ఆర్.సురేశ్‌రెడ్డి, డాక్టర్ బండి పార్థసారథిలతో కలసి వద్దిరాజు రవిచంద్ర మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన వారిని కాంగ్రెస్ లాక్కోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. ఇటువంటి పద్ధతులకు స్వస్తి చెప్పి ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రానికి సింగరేణి బంగారం లాంటిదని, సింగరేణిని ప్రైవేటుపరం కానివ్వకుండా తమ పార్టీ అడ్డుకుంటుందని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి సాగునీటి పథకానికి జాతీయహోదా ఇవ్వాలని, ఖాజీపేటలో రైల్వే కోచ్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీలు డిమాండ్ చేశారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని, దీనికోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని సూచించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా ప్రాంతీయ పార్టీలను అణగదొక్కేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు కుట్ర పన్నుతున్నాయని కె.ఆర్.సురేశ్‌రెడ్డి మండిపడ్డారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం పదేళ్ల పాటు అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందని, అయితే కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సినవి మాత్రం ఇవ్వలేదని విమర్శించారు. త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రైతులు, మహిళలు, నిరుద్యోగులకు అధిక ప్రాధాన్యతను ఇస్తారని ఆశిస్తున్నట్లు సురేశ్‌రెడ్డి తెలిపారు.

ఫిరాయింపుల్ని ప్రోత్సహించిందే బీఆర్ఎస్: గజ్జెల కాంతం

సాక్షి, హైదరాబాద్: ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని, కేసీఆర్ కేబినెట్‌లోకి మొత్తం టీడీపీ ఎమ్మెల్యేలను తీసుకోలేదా? అని టీపీసీసీ నేత గజ్జెల కాంతం ప్రశ్నించారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు లేదన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డిలు కాంగ్రెస్ నుంచి వెళ్లినవారు కాదా?, కాంగ్రెస్ నుండి మొత్తం ఎమ్మెల్యేలను తీసుకునేటప్పుడు ఫిరాయింపులు గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి.. భట్టి విక్రమార్కను ప్రతిపక్ష హోదా నుంచి దింపేయలేదా? అని ప్రశ్నించారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

- ఆయిల్‌పాం సాగు వైపు రైతుల మొగ్గు
- కొత్త వంగడాలు, విత్తనాలతో గణనీయంగా పంటల ఉత్పత్తి

పాలెం కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి



సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ రాష్ట్రం అవతరించిన పదేళ్లలో వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా వరిసాగు రెట్టింపు స్థాయిలో పెరిగిందని చెప్పారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యవసాయ రంగ నిపుణుడు, శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డితో 'సాక్షి' ఇంటర్వ్యూ నిర్వహించగా, ఆయన పలు విషయాలను వెల్లడించారు.

సాగునీటి లభ్యతతో పెరిగిన సాగు..

గడిచిన పదేళ్లలో వ్యవసాయ రంగం, సాగునీటి రంగాల్లో వచ్చిన మార్పులతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో సాగునీరు అందుబాటులోకి రావడం.. కాల్వల్లో నీటితో పాటు చెరువులు, కుంటలను నింపుకోవడంతో వరిసాగు విస్తీర్ణం రెట్టింపు స్థాయికి చేరింది. గతంలో ఇక్కడి రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. బావులు, బోరుబావులు ఉన్న రైతులే రెండో పంటగా వేరుశనగను సాగుచేసేందుకు వీలుండేది. ఆరుతడి పంటల స్థానంలో వరిసాగు ఎక్కువగా సాగుచేస్తున్నారు. అలాగే వేరుశనగను రెండో పంటగా ఎంచుకుంటున్నారు. కాల్వలు, చెరువులు, కుంటల్లో నీటితో భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల కింద పంటలకు సైతం సాగునీటి పరిస్థితి మెరుగైంది.

సాంకేతికతతో అధిక దిగుబడి..

వ్యవసాయ రంగంలో వచ్చిన అధునాతన సాంకేతికత, యంత్రాల వినియోగంతో పంటల దిగుబడి పెరగడంతో పాటు కూలీల కొరత తగ్గింది. వరి, పత్తి, జొన్న పంటల్లో వచ్చిన కొత్త వంగడాలు, హైబ్రీడ్ విత్తనాలతో మంచి దిగుబడి వస్తోంది. అధిక సాంద్రత విధానంలో పత్తిసాగుతో గొప్ప ఫలితాలు కనిపిస్తున్నాయి. వరిలో నాటు వేయకుండా నేరుగా వెదజల్లడం, డ్రమ్ సీడర్, సీడ్ మిషన్ విధానం ద్వారా నాటు వేసేందుకు ఖర్చులు కలిసిరావడంతో పాటు కాలపరిమితి కూడా తగ్గుతోంది. పంటలకు రసాయనాల వినియోగం కోసం డ్రోన్‌ల ద్వారా స్ప్రే చేయడంతో మందుల ఖర్చు, సమయం మిగులుతోంది.

ఆయిల్‌పాంకు డిమాండ్..

వరిపంటకు ప్రాధాన్యం పెరగడంతో పాటు ఆయిల్‌పాం వంటి వాణిజ్య పంటలకు రైతుల్లో డిమాండ్ పెరుగుతోంది. 2014కు ముందు ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఆయిల్‌పాం సాగు వెయ్యి ఎకరాలలోపే ఉండేది. ప్రస్తుతం కేవీకే పరిధిలోనే 9 వేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పాం సాగుచేస్తున్నారు. కంది, పప్పు ధాన్యాల పంటల వైపు రైతులు దృష్టిపెడుతున్నారు. గత ఐదేళ్లలో కేవీకే ద్వారా సుమారు 2,500 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు సరఫరా చేశాం. కేవీకే ఆధ్వర్యంలో సుమారు 42 వేల ఎకరాల్లో కంది ఇతర తృణధాన్యాల సాగు పెరిగింది. మామిడి, మిర్చి పంటల సాగు సైతం పెరుగుతోంది. మామిడి తోటల్లో అంతరపంటగా మినుమును రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. మామిడి, మిర్చి, ఆయిల్‌పాం, కూరగాయల సాగు విస్తీర్ణం పదేళ్లలో బాగా పెరిగింది.

ప్రభుత్వ పాఠశాలలో 'నో అడ్మిషన్' బోర్డు



పాఠశాల ముందు నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎం వేణుగోపాల్



నారాయణపేట రూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమై పక్షం రోజులు కాకముందే 245 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 859కి చేరింది. ఒక్కో తరగతిలో 40 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 60 నుంచి 80 మంది విద్యార్థులను కూర్చోబెట్టాల్సి వస్తుంది. మరిన్ని అడ్మిషన్లు తీసుకుంటే ఇబ్బందులు తప్పవని భావించి గురువారం పాఠశాల ఎదుట నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేశారు. పాఠశాల పట్టణ నడిబొడ్డున, బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ఉండటంతో పాటు గత కలెక్టర్ కోయ శ్రీహర్ష పాఠశాల అభివృద్ధికి రూ.23 లక్షలకుపైగా నిధులు కేటాయించడంతో ఎంతో సౌకర్యంగా మారింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు టీసీలు పట్టుకొని ఇదే పాఠశాలకు వస్తున్నారు.

కొత్తపల్లి వాసికి గ్లోబల్ ఇన్‌స్పైర్ పురస్కారం



మద్దూరు: సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే కొత్తపల్లికి చెందిన నరేష్‌కు గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో మా గ్లోబల్ ఫౌండేషన్ గ్లోబల్ ఇన్‌స్పైర్–2024 పురస్కారం ప్రదానం చేసింది. శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, రాష్ట్ర గ్రంథాలయాలశాఖ చైర్మన్ డా.రియాజ్, హెచ్‌కే పార్మిసెంట్ మేకప్ క్లినిక్ వ్యవస్థాపకుడు తేజ నంది అవార్డు, శాలువాతో సత్కరించారు. అవార్డుకు తనను ఎంపిక చేసినందుకు నరేష్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

జిల్లాకేంద్రంలో భారీ వర్షం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీచిత్తడిగా మారాయి. వరద నీటితో మురుగుకాల్వలు నిండి పొంగి పొర్లాయి. వివిధ పనుల కోసం బయటకు వచ్చిన వారు తడిసి ముద్దయ్యారు. మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారాయి.

పరిశ్రమల్లో విస్తృత తనిఖీలు



పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాజాపూర్: పోలేపల్లి సెజ్‌లోని పలు పరిశ్రమల్లో గురువారం కాలుష్య నియంత్రణ మండలి విస్తృత తనిఖీలు చేపట్టింది. పరిశ్రమల కాలుష్యంతో పంటలు దెబ్బతింటున్నాయని ఇటీవల రాజాపూర్ మండలం రాయపల్లికి చెందిన మహిళా రైతు మాధవి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు గురువారం కాలుష్య నియంత్రణ మండలి ఏఈ విద్యులత, ఇండస్ట్రీస్ జీఎం బాబూరావు, డీఏఓ వెంకటేష్, ఏడీఏ ఆంజనేయులు, ఏఈలు నరేందర్, గ్రౌండ్ వాటర్ అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ హరీష్‌బాబు, అసిస్టెంట్ హైడ్రోజియాలజిస్ట్ మానస రైతుల పొలాలు, వ్యవసాయ బోర్లను పరిశీలించారు. అనంతరం సెజ్‌లోని హెల్త్ కేర్ ట్రి యూనిట్, ఎవర్టొజన్ ఫార్మా పరిశ్రమల్లో నీటి నమూనాలను సేకరించారు. ఈసందర్భంగా ఇండస్ట్రీస్ జీఎం మాట్లాడుతూ.. పరిశ్రమల నుంచి కెమికల్ వాటర్‌ను బయటికి వదలకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ.. ఎందుకు బయటికి వదులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వ్యవసాయ పొలాల్లోకి పరిశ్రమల నుంచి కాలుష్య నీటిని వదలకుండా చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఐఐసీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు గతంలో కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ బోర్లు కలుషితం కాకుండా చూడాలని కోరారు. ఇదిలా ఉంటే.. గతంలోనే రైతుల వ్యవసాయ బోర్ల నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించినట్లు డీఏఓ వెంకటేష్ పేర్కొన్నారు. ఇక్కడి బోర్లలోని నీరు సాగుకు పనికి రాదని.. భూములు సైతం సాగుకు పనికిరావని రిపోర్టులు ఇచ్చినట్లు తెలిపారు. రైతులు పంటలు సాగుచేసినా దిగుబడి రాదని అప్పటి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు వివరించారు.



ఆమ్నిల్ కంకాలజీ పరిశ్రమ గేటు తెరవక పోవడంతో బయట వేచి చూస్తున్న అధికారులు

పరిశ్రమ గేటు తెరవని సిబ్బంది..

కాలుష్య నియంత్రణ మండలి తనిఖీల్లో భాగంగా సెజ్‌లోని ఆమ్నిల్ కంకాలజీ పరిశ్రమకు వెళ్లగా.. సెక్యూరిటీ సిబ్బంది గేట్ తెరవలేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాము తనిఖీలకు వచ్చామని అధికారులు చెప్పినప్పటికీ ఫలితం లేకపోయింది. 20 నిమిషాలకు పైగా అక్కడే వేచి చూశారు. అయినప్పటికీ పరిశ్రమ గేటు తెరవక పోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది



దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆసరా పింఛన్‌తో పాటు బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్ చైర్ల వంటి ఉపకరణాలు అందిస్తూ వారిని ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా మహిళా శిశు, దివ్యాంగ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దివ్యాంగులకు 3 బ్యాటరీ వీల్ చైర్లు, 8 మూడు చక్రాల స్కూటర్లు, 7 హియరింగ్ పరికరాలు, 5 ట్రై సైకిళ్లు,14 స్మార్ట్ ఫోన్లు, మూడు చేతి కర్రలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 30 మంది లబ్ధిదారులకు దాదాపుగా రూ. 20 లక్షల పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.